క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంటోన్మెంట్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణాలతో సోమవారం కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు ఉంటాయని ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. గన్‌రాక్ సబ్ స్టేషన్ మేడ్చల్, సుభాష్ నగర్ ఫీడర్‌ల పరిధిలోని మేడ్చల్, సుభాష్ నగర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. సూర్య ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు బన్సీలాల్‌పేట్‌లో మంత్రి తలసాని పర్యటన

పద్మారావునగర్: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ నెల 30న బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు సీసీ నగర్, గాంధీ నగర్, బన్సీలాల్‌పేట్ డి క్లాస్ ప్రాంతాల్లో పర్యటించి పలు ప్రజల సమస్యలను తెలుసుకుంటారని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎల్.వెంకటేశన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీసీ నగర్ మహవీర్ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు గాంధీనగర్ డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో నూతన వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను మంత్రి ప్రారంభిస్తారు. బన్సీలాల్‌పేట్ డి క్లాస్‌లోని అంబేడ్కర్ యువజన సంఘాన్ని సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుంటారు. స్థానిక కార్పొరేటర్ కె.హేమలతతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొంటారు.

ఆకట్టుకున్న ఫ్యాషన్ షో


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కంట్రీ క్లబ్ గ్రూప్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి తదితరులు


సనత్‌నగర్: బేగంపేటలోని కంట్రీ క్లబ్‌లో నిర్వహించిన డార్లింగ్స్ డే ఔట్ ప్రీ ఈవెంట్ ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ఫ్యాషన్ షోలో భార్యాభర్తలు ర్యాంప్‌పై మెరిశారు. మోడళ్లను తలపించే రీతిలో వాక్ చేస్తూ అదరహో అనిపించారు. అనంతరం కంట్రీ క్లబ్ గ్రూప్ చైర్మన్ వై.రాజీవ్ రెడ్డి వారితో కలిసి డార్లింగ్స్ డే ఔట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కంట్రీ క్లబ్ ఫిబ్రవరి 12న హైదరాబాద్‌తో పాటు ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, అహ్మదాబాద్, సూరత్, పూణె, కేరళ, బెంగుళూరు, చెన్నై, కొల్హాపూర్ వంటి నగరాల్లో ఈ వేడుకను నిర్వహిస్తుందని వివరించారు.

టీఆర్‌పీ 50 స్థానాల్లో పోటీ చేస్తుంది

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో 50 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలంగాణ రిపబ్లికన్ పార్టీ (టీఆర్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు లాయర్ ఎన్.యాదీశ్వర్(యాదన్న) పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారడంతో తెలంగాణ ప్రజలు నిరుత్సాహ పడుతున్నారని చెప్పారు. అధికారం ద్వారా సంపాదనకు అలవాటుపడిన సీఎం కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధిని, ప్రజల ఆకాంక్షలను వదిలేశారన్నారు. ఉద్యమకారులకు, విద్యా వంతులకు, నిరుద్యోగులకు, ప్రజాసంఘాల నేతలకు, కవులు, కళాకారులకు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

మారణాయుధంతో సంచరిస్తున్న వ్యక్తికి జైలు శిక్ష

చిలకలగూడ: మారణాయుధంతో సంచరిస్తున్న యువకుడికి 30 రోజులు జైలు శిక్ష పడింది. చిలకలగూడ సీఐ నరేష్, డీఐ నాగేశ్వర రావు, డీఎస్ఐ సాయికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. పార్శిగుట్టకు చెందిన పాత నేరస్థుడు రవికుమార్ (22) అర్ధరాత్రి దాటిన తర్వాత కత్తి వంటి మారణాయుధంతో సంచరిస్తూ నేరాలకు పాల్పడుతుంటాడు. శనివారం వేకువజామున గాంధీ ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా గస్తీ పోలీసులు అదుపులోకి తీసుకుని మారణాయుధాన్ని స్వాధీనం చేసుకుని, సికింద్రాబాద్ 15వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా 30 రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు రవికుమార్‌ను చంచలగూడ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.


సెంట్రల్ జోన్ డీసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు ఆదివారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. - సనత్‌నగర్

తాగుబోతుల అడ్డా.. హాకీ మైదానం

- ఎదురుగా వైన్‌షాపు ఉండడంతో తాగుబోతులు తిష్ట వేస్తున్న వైనం
- మైదానాన్ని బోర్డు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు
- అభివృద్ధి చేసి వసతులు కల్పించాలని కోరుతున్న క్రీడాకారులు


మడ్‌ఫోర్ట్ హాకీ మైదానం

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా మడ్‌ఫోర్ట్ హాకీ మైదానం మందుబాబులకు అడ్డాగా మారింది. మైదానానికి ఎదురుగా వైన్‌షాపు ఉండడంతో అక్కడ మద్యం కొనుగోలు చేసి ఖాళీ స్థలంలోకి తాగుతున్నారు. మరికొందరు ఆకతాయిలు ఇటీవల క్రీడా పరికరాలను భద్రపరిచే గది తలుపు తాళం పగులగొట్టి ఖాళీ మద్యం బాటిళ్లను అక్కడ పడేస్తున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పలు రకాల వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే మైదానాలు తాగుబోతులకు అడ్డాగా మారుతున్నాయని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, పలువురు క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ మైదానంలో శిక్షణ పొందిన క్రీడాకారులెందరో..

- సరైన వసతులు లేని కాలంలో ఎనిమిది ఎకరాల స్థలంలో ఉన్న మడ్‌ఫోర్ట్ మైదానంలో హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్రం, దేశం తరఫున ప్రాతినిధ్యం వహించి పేరు ప్రఖ్యాతలు సాధించారు.
- హాకీ దిగ్గజాలు ట్రిపుల్ ఒలింపియన్ ముఖేష్ కుమార్, ఎడ్వర్డ్‌లూయిస్, రుద్రవేలు, జయవేలు, రాజన్‌పాల్, సుందర్‌రాజన్ వంటి ఎందరో క్రీడాకారులు ఈ మైదానంలో శిక్షణ పొందారు. రైల్వేస్, బీహెచ్‌ఈఎల్, ఎస్‌బీఐ జట్ల తరఫున ఆడారు.
- మైదానంపై కన్నేసిన కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించగా 2006లో బోర్డు నామినేటెడ్ సభ్యుడిగా ఉన్న జంపన ప్రతాప్ అప్పటి సీఈవో ఆరోగ్యనాథన్ సహకారంతో మైదానం చుట్టూ గోడ నిర్మించారు.
- దాతల సహకారంతో మైదానాన్ని అభివృద్ధి చేసి క్రీడాకారులు శిక్షణ పొందేందుకు చర్యలు తీసుకున్నారు. 2013లో క్రీడా పరికరాలు భద్రపరిచేందుకు నాలుగున్నర లక్షల రూపాయల వ్యయంతో ఓ గది నిర్మించారు.
- వాలీబాల్, బాస్కెట్‌బాల్, హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్ క్రీడలకు సంబంధించిన గోల్‌పోస్టులు, నెట్‌లు, క్రీడా పరికరాలు భద్రపరిచారు. అయితే ప్రభుత్వాలు మారిన అనంతరం మడ్‌ఫోర్ట్ హాకీ మైదానంపై బోర్డు అధికారులు, పాలకులు నిర్లక్ష్యం చేయడంతో తాగుబోతులకు అడ్డాగా మారింది.

బోర్డు అధికారులు దృష్టి సారించాలి



కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఇది అతిపెద్ద క్రీడా మైదానం. సరైన వసతులు లేని కాలంలో ఎందరో ఈ మైదానంలో శిక్షణ పొంది రాష్ట్రానికి, దేశానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారు. శెలవు దినాల్లో స్థానికంగా ఉంటున్న యువకులు ఈ మైదానంలో హాకీ, క్రికెట్ ఆడుతుంటారు. బోర్డు అధికారులు, పాలకులు దృష్టి సారించి గ్రౌండ్‌ను క్రీడాకారులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలి. - మహేందర్, క్రీడాకారుడు

మైదానాన్ని అభివృద్ధి చేయాలి



క్రీడా మైదానం తాగుబోతులకు అడ్డాగా మారడం దురదృష్టకరం. బోర్డు అధికారులు, ఎమ్మెల్యే సాయన్న, ఎంపీ రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దృష్టి సారించి మైదానాన్ని అభివృద్ధి చేయాలి. స్టేడియం నిర్మించి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలి. - జంపన ప్రతాప్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు


గదిలో క్రీడా పరికరాల మధ్య ఉన్న ఖాళీ మద్యం బాటిళ్లు


క్రీడా పరికరాలు భద్రపరిచే గది

ఆలయాల పునర్నిర్మాణ పనులు ప్రారంభం


ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

బన్సీలాల్‌పేట్: ఆధ్యాత్మికత మనిషి జీవితాన్ని ఎంతో ప్రభావితం చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ జయప్రకాశ్‌నగర్‌లోని రేణుక ఎల్లమ్మ, ఐడీహెచ్ కాలనీలోని తుల్జాభవానీ దేవాలయాల పునర్నిర్మాణ పనులను ఆదివారం స్థానిక కార్పొరేటర్ కె.హేమలతతో కలిసి మంత్రి తలసాని ప్రారంభించారు. ఈ ఆలయాలను సుమారు రూ.20లక్షల సొంత నిధులతో మంత్రి పునర్నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతత, ఆనందమయ జీవనానికి భక్తి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎల్.వెంకటేశన్, గజ్జెల శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీపతి, ఏసూరి మహేష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


బస్తీవాసులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మినిస్టర్ రోడ్‌లోని దక్కన్ భవనం కూల్చివేత కొనసాగుతున్న నేపథ్యంలో ఆదివారం ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం పక్కనే ఉన్న కాచిబోలి బస్తీ ప్రజలతో ఆయన మాట్లాడారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని కూల్చివేతలు చేపట్టామని చెప్పారు. అంతవరకు బస్తీవాసులకు మున్నూరుకాపు సంఘం హాల్‌లో బస కల్పించడంతో పాటు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కూల్చివేతలు పూర్తయ్యేంత వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాను చూసుకుంటానని, కూల్చివేతలతో బస్తీవాసుల భవనాలకు ఇబ్బందులు ఏర్పడితే తాను బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అగ్ని ప్రమాద సమయంలో మరణించిన ముగ్గురి కుటుంబ సభ్యులకు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని మంత్రి పేర్కొన్నారు. నగరంలో అనుమతి లేని భవనాలు, జనావాసాల మధ్య ఉన్న గోదాంల విషయంలో చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

ఆర్టీసీకి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలి

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో టీఎస్‌ఆర్టీసీకి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని బహుజన వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం తార్నాకలోని యూనియన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. నూతనంగా బస్సుల కొనుగోలు, ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన పే స్కేల్ బకాయిలు (2017, 2021), బాండ్ల డబ్బులు(2015), డీఏ బకాయిల చెల్లింపులకు సరిపడా నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీఎస్‌ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్, సత్యనారాయణ, బి.శ్రీనివాస్‌గౌడ్, జి.సురేఖ, ఎస్.రవికుమార్, సీహెచ్ రవీందర్ పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్‌లో సాంస్కృతిక వార్షికోత్సవం

కంటోన్మెంట్: చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసే విధంగా బోధన సాగాలని సెయింట్ పీటర్స్ విద్యా సంస్థల చైర్మన్ టి.బాలరెడ్డి అన్నారు. బోయిన్‌పల్లి సీతారాంపూర్‌లోని సెయింట్ పీటర్స్ ప్రైమరీ విద్యార్థులకు «ఎక్స్‌పీరియెన్సియా ఫెలిజ్» పేరిట ప్రత్యేక వార్షిక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలరెడ్డి చిన్నారులను ఉద్దేశించి మాట్లాడారు. తమ విద్యా సంస్థల్లో ఎప్పటికప్పుడు వినూత్నమైన బోధన పద్ధతుల ద్వారా విద్యార్థులను నైపుణ్య వంతులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అనంతరం సఫారీ, కలెక్టింగ్, ఫ్యామిలీ డిన్నర్, స్టోరీ టైమ్, వెకేషన్, లెర్నింగ్ ఎట్ స్కూల్, ప్లేయింగ్ ఇన్ రెయిన్, రైడింగ్ బైసైకిల్, లెర్నింగ్ అబౌట్ గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ వంటి అంశాలపై చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో సెయింట్ పీటర్స్ విద్యా సంస్థల కరస్పాండెంట్ టీ.ఏ.రెడ్డి, డైరెక్టర్ టి.అరుణ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సువర్ణ, అకడమిక్ ఇన్‌చార్జ్ అనుపమ, అనిత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలకు త్వరలోనే పరిష్కారం


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సాయన్న తదితరులు

కంటోన్మెంట్: చింతల్ బస్తీలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే సాయన్న అన్నారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డితో కలిసి ఆదివారం 1వ వార్డులోని చింతల్ బస్తీలో పర్యటించారు. బస్తీవాసులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి స్థానిక సమస్యలపై చర్చించారు. కమ్యూనిటీహాల్ నిర్మాణానికి తాను గతంలోనే ఎమ్మెల్యే నిధులు కేటాయించానని తెలిపారు. త్వరలోనే పనులు చేపట్టాల్సిందిగా సీఈఓ మధుకర్‌నాయక్‌ను కోరామన్నారు. భూగర్భ డ్రైనేజీ, తాగునీరు, అంతర్గత రోడ్ల మరమ్మతులు తదితర పనులను దశలవారీగా పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బస్తీవాసులు పి.బలరామ్, పి.కృష్ణ, బాబూరావు, రఘునాథ్, బి.మధు, ప్రకాశ్, మహేందర్, మోహన్, నరేందర్, కృష్ణ, బీఆర్ఎస్ నేతలు నివేదిత, ముప్పిడి మధుకర్, సదానంద్‌గౌడ్, సంతోష్, బాస్కర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటాడుతున్న వ్యక్తుల అరెస్ట్

సనత్‌నగర్: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వారి వద్ద నుంచి రూ.1,12,800 స్వాధీనం చేసుకున్నారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ సందీప్‌నాయుడు తెలిపిన వివరాల మేరకు.. ఎల్లారెడ్డిగూడలోని దివ్య ఎన్‌క్లేవ్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం సాయంత్రం దాడి చేశారు. నిర్వాహకుడు జి.వెంకటేశ్వరరావుతో సహా తొమ్మిది మందిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను ఎస్ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోల్లో).. టమోటా రూ.13, నల్ల వంకాయ 28, పొడుగు వంకాయ 35, బెండకాయ 55, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 32, పందిరిబీర 45, క్యాబేజీ 9, క్యారెట్ 21, దొండ 23, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 28, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 19, చామగడ్డ 70, మొరంగడ్డ 26, కందగడ్డ 31, సొరకాయ 11, పొట్లకాయ 10, అరటికాయ 10 (ఒకటి), మునగకాయ 4-6, ముల్లంగి 3-5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

సమస్యలు పరిష్కరించాలని వినతి


డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రవీంద్రనగర్ వాసులు

లాలాపేట: నూతన డ్రైనేజీ పైపులైన్, సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ ఆదివారం రవీంద్రనగర్, పార్థివాడ బస్తీ వాసులు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి డిప్యూటీ మేయర్ హామీ ఇచ్చారు. గతంలో చేసిన అభ్యర్థనపై స్పందించి స్థానికంగా ఉన్న గ్రేవ్‌యార్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయించిన డిప్యూటీ మేయర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు స్పందన


విదేశీ యూనివర్సిటీల సమాచారం తెలుసుకుంటున్న విద్యార్థులు

సనత్‌నగర్: వన్ విండో ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని మ్యారీగోల్డ్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా విదేశీ యూనివర్సిటీలు అందిస్తున్న విద్యా ప్రమాణాలు, కోర్సులు, స్కాలర్‌షిప్‌లు వంటి తదితర అంశాలను పలువురు నిపుణులు విద్యార్థులకు వివరించారు. యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్, రోచెస్టర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యూనివర్సిటీ ఆఫ్ మియామి, యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్-మాడిసన్, యూనివర్సిటీ ఆఫ్ అరిజోనా, యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్ చికాగో, ఎంఐటీ, యూసీఎల్ఏ, యూకే ఆధారిత బి-స్కూల్స్ వంటి అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో ప్రవేశ సరళి, అక్కడ ఉన్న ఉద్యోగ అవకాశాలు, వీసా దరఖాస్తు తదితర అంశాలకు సంబంధించిన సందేహాలను విద్యార్థులు నివృత్తి చేసుకున్నారు. వన్ విండో ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సహ వ్యవస్థాపకుడు అనురాగ్ జైన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంకిత్‌జైన్ మాట్లాడుతూ.. గత 12 ఏళ్లలో 340కి పైగా విశ్వవిద్యాలయాల్లో దాదాపు 12,000 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడంలో తమ సంస్థ తోడ్పాటు అందించిందన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతుందని సామాజిక కార్యకర్త నేతికార్ మహేశ్‌లాల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం తార్నాక డివిజన్ లాలాపేట సాయినగర్‌లో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 5 ఏళ్ల క్రితం సాయినగర్‌లో మూడు బ్లాకులుగా 107 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారని, నేటికి ఒక్క బ్లాక్ సైతం పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో పాటు ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేకపోవడం సాయినగర్ వాసులకు శాపంగా మారిందన్నారు. ఇళ్ల నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారో లబ్ధిదారులకు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

సనత్‌నగర్: లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఆర్‌బీ నారాయణ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ఎస్ఆర్‌టీ కాలనీలోని ప్రభుత్వ రౌండ్ టేబుల్ ఉన్నత పాఠశాల, అశోక్‌కాలనీలోని సనత్‌నగర్ ఓల్డ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల మధ్య జరిగిన టోర్నమెంట్ ఉత్కంఠ భరితంగా సాగింది. తన తండ్రి ఆర్‌బీ నారాయణ పేరిట సీనియర్ కాంగ్రెస్ నేత ఆర్‌బీ నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఉపాధ్యాయులు శ్రీనివాస్, బస్వరాజ్, వాసుదేవ్‌లతో పాటు రవి, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యను పరిష్కరిస్తాం


డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: రామన్నకుంట ముంపు సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. కంటోన్మెంట్ 6వ వార్డు సీతారాంపూర్‌లో రూ.40 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, రూ.26 లక్షల నిధులతో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులకు బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు భానుక నర్మదతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. సరైన ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడం వల్ల సీతారాంపూర్ పరిధిలోని పలు ప్రాంతాలు తరచూ ముంపునకు గురవుతున్నాయన్నారు. వర్షపు నీటికి తోడు ప్రణాళిక లోపంతో చేపట్టిన పనుల వల్లే సమస్య జటిలమైందన్నారు. ఈ నేపథ్యంలో తాము క్రమ పద్ధతిలో పనులు చేపడుతున్నామన్నారు. తొలుత డ్రైనేజీ, తాగునీటి లైన్ చేపట్టి ఆ తర్వాత రోడ్ల నిర్మాణం చేపడతామని ఆయన అన్నారు. ఎగువన ఉన్న కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి నుంచి వచ్చే వరద నీటితో సీతారాంపూర్‌లో సమస్య తీవ్రమవుతోందని, మురుగు నీరు, వరద నీరు రామన్నకుంటలో కలవకుండా ప్రత్యేక లైన్ నిర్మించేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బాణాల శ్రీనివాస్‌రెడ్డి, శంకరయ్య, సత్యనారాయణ, పాండు, నారాయణ, నాగభూషణం, గోపాల్‌గౌడ్, గద్దం పాపయ్యయాదవ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి


తాగునీటి సమస్యపై శ్రీగణేష్‌కు వివరిస్తున్న మహిళలు

రసూల్‌పురా: డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో ఉంటున్న వారికి తాగునీటి వసతి కల్పించాలని శ్రీగణేష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీగణేష్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్నకు విజ్ఞప్తి చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గం రసూల్‌పురా వార్డు సిల్వర్ కాంపౌండ్ డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో శ్రీగణేష్ ఆదివారం పర్యటించారు. ఇక్కడకు వచ్చి పదహారు నెలలు గడిచినా తాగునీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు చెప్పారు. బోరు నీటిపై ఆధారపడాల్సి వస్తుందని, పక్క బస్తీల్లోకి వెళ్లి నీటిని మోసుకు రావాల్సి వస్తోందని, ఎమ్మెల్యే సాయన్నకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలు పరిష్కరించేందుకు ఓట్లు వేసి గెలిపిస్తే నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సాయన్న దృష్టి సారించి తాగునీటి వసతి కల్పించాలని కోరారు.